రైల్వేస్టేషన్‌కు దారేదీ?

- రోడ్డు సౌకర్యం లేక ప్రయాణికుల పాట్లు
- వెలవెలబోతున్న తెల్లాపూర్ రైల్వేస్టేషన్
- సేవలకు దూరమవుతున్న పట్టణ ప్రజలు
- ర్యాంప్ రోడ్డు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

తెల్లాపూర్‌లో రైల్వేస్టేషన్ ఉన్నప్పటికీ అక్కడి ప్రజలకు మాత్రం ఉపయోగపడటంలేదు. కారణం.. సరైన రోడ్డు సౌకర్యం లేక పోవడమే. రైల్వేస్టేషన్‌కు అవసరమైన రోడ్డు మార్గం లేకపోవడంతో పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో రైల్వేసేవలను వినియోగించుకోలే పోతున్నారు. దీంతో ప్రయాణికులు చేసేదేమీలేక ట్రాఫిక్ ఇబ్బందులను దాటుకుంటూ 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెల్లాపూర్ రైల్వేస్టేషన్‌కు సరైన రోడ్డు సౌకర్యం కల్పించి ఇక్కడి జనాభాకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసుల సంఖ్యను పెంచి మెరుగైన రైల్వేసేవలను అందించాలని స్థానికులు కోరుతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

తెల్లాపూర్ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల రాక తగ్గడంతో స్టేషన్ అలంకారప్రాయంగా మారింది. దీంతో ఇక్కడి ప్రజలు రైల్వేసేవలకు దూరమవుతున్నారు. రైల్వేస్టేషన్‌కు రోడ్డు సరైన మార్గం కల్పించాలని పలుమార్లు రైల్వే అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

తప్పని తిప్పలు

తెల్లాపూర్ రైల్వేస్టేషన్‌కు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రైల్వేలైన్‌కు ఆనుకొని ఉన్న మంజీర పైపులైన్ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు. కానీ.. ఈ మార్గంలో చెత్త కుప్పలు, భవన శిథిలాలు రోడ్డుపై డంపింగ్ చేయడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ తర్వాత విద్యుత్‌నగర్ కాలనీ మీదుగా రైల్వేస్టేషన్‌కు మార్గాన్ని ఏర్పాటు చేశారు. అయినప్పటికీ రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే చుట్టూ 3 కిలోమీటర్లు తిరిగి పోవాల్సి వస్తోందని తెల్లాపూర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని రైల్వేసేవలు

తెల్లాపూర్, నల్లగండ్ల ప్రాంతంలో ఇతర రాష్ట్రాలకు చెందిన 2 లక్షలకు పైగా ఐటీ నిపుణులు ఈ ప్రాంతంతో స్థిరపడ్డారు. దీంతో వారి ప్రాంతాలకు వెళ్లాలంటే రైల్వేస్టేషన్‌కు సరియైన రోడ్డు మార్గం లేకపోవడంతో వారు రైల్వే సేవలకు దూరమవుతూ టాక్సీలను ఆశ్రయిస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరనగర్ మీదుగా కొల్లూర్ రింగ్‌రోడ్డు వరకు రేడియల్ రోడ్డు నెంబర్ 7ను అభివృద్ధి చేశారు. ఈ రోడ్డు తెల్లాపూర్ రైల్వేస్టేషన్‌ను ఆనుకొని వెళ్తుంది. అయితే రైల్వేస్టేషన్‌కు రేడియల్ రోడ్డుకు మధ్యలో చిన్న కాలువ ఉండటంతో రైల్వేస్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితి. దీంతో ఇక్కడ చిన్న వంతెన లేదా ర్యాంప్ రోడ్డు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తే తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూర్, ఈదులనాగులపల్లి, వెలిమెల నుంచి వచ్చే ప్రజలు రైల్వేస్టేషన్‌కు వచ్చేందుకు ప్రయాణం సులభంగా ఉంటుంది.



రేడియల్ రోడ్డు ఆనుకొని ఉన్న తెల్లాపూర్ రైల్వేస్టేషన్

రైల్వే సేవలను మెరుగుపర్చాలి



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రైల్వేస్టేషన్ ఉన్నప్పటికీ ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. రేడియల్ రోడ్డు నెంబర్ 7కు రైల్వేస్టేషన్‌కు అనుసంధానం చేయాలి. ఎన్నోసార్లు రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు, రాజకీయ నేతలకు వినతిపత్రాలు సైతం అందించాం. అయినా ప్రయోజనం లేకుండాపోయింది.

– ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఎంఎంటీఎస్ సర్వీసులు పెంచండి



తెల్లాపూర్ రైల్వేస్టేషన్ నుంచి ఎంఎంటీఎస్ రైలు సర్వీస్‌లను పెంచాలి. ఎంఎంటీఎస్‌ల సంఖ్య తక్కువగా ఉండటంతో లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. సర్వీస్‌ల సంఖ్య పెంచితే విద్యార్థులు, కార్మికుల, ఉద్యోగస్తులు, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– రవి, ఇంద్రానగర్, తెల్లాపూర్

ఎంఎంటీఎస్ రైలు సర్వీస్‌లు పెంచాలని విజ్ఞప్తి

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అనేక కాలనీలు, గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలు రావడంతో ఇక్కడ జనాభా సంఖ్య పెరిగింది. ఇక్కడి ప్రజలకు రైల్వే సర్వీస్‌లు సరిగా లేకపోవడంతో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో ఎంఎంటీఎస్ రైలు సర్వీస్‌లను పెంచితే రైల్వేకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



మేడే ప్రదర్శన సభ కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): కార్మికుల హక్కులు, సంక్షేమం, 8 గంటల పని విధానం తదితర హక్కులను కాపాడుకోవడం కోసం కార్మికులందరు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మేడే ప్రదర్శన సభ కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే పురస్కరించుకొని పట్టణంలో భారీ ప్రదర్శన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు రమేష్‌గౌడ్, శ్రీనివాస్, ఏసోబ్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు అవార్డు ప్రదానం



ల్యాబ్ టెక్నీషియన్ సుధాకర్‌ను సన్మానిస్తున్న మహిపాల్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ సుధాకర్‌కు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ 5స్టార్ అవార్డు ప్రదానం చేసింది. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం సుధాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, యునైటెడ్ తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గౌస్ పాషా, ఏలిషా, పవన్, కృష్ణ, వసీం, గోపాల్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప జాతర

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని చందాపూర్ గ్రామంలో సోమవారం బీరప్ప జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బీరప్పకామరాతిల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, నాయకులు భూపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, నర్సింలు, ఆశిరెడ్డి, మల్లేశం, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల టోల్ ప్లాజా వద్ద అధికారులు, పోలీసులు వాహనాలను సోమవారం తనిఖీలు చేశారు. ఎంపీ ఎన్నికల్లో భాగంగా హైదరాబాద్–మెదక్ జాతీయ రహదారిపై అధికారులు శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

మునిపల్లి(అందోల్): ఎంపీ ఎన్నికల నేపథ్యంలో వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్ఎస్ టీమ్ సెంట్రల్ స్టాటిక్స్ సర్వేలెన్స్ టీం అధికారి నరేష్‌కుమార్ అన్నారు. మునిపల్లి మండల పరిధిలోని తాటిపల్లి గ్రామంలో సోమవారం వాహనాల తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఈశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: పట్టణ పరిధిలోని ఇంద్రేశం పెద్దవాగును కబ్జాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇంద్రేశం మాజీ సర్పంచ్ బండి హరిశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇరిగేషన్, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శికి సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామం శివారులోని పెద్దవాగులో సర్వే నెంబర్ 178లో బఫ్ఫర్‌జోన్‌ను బచ్చుగూడకు చెందిన కొందరు కబ్జా చేసి అందులో మట్టి నింపుతున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఉపసర్పంచ్ శివారెడ్డి, సాయిగౌడ్, నవీన్‌రావు, రవీందర్‌బాబు, శివరాజ్, ప్రభాకర్‌రెడ్డి, సిటిజన్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీరప్పస్వామికి మంత్రి దామోదర పూజలు

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రంలో బీరప్ప కల్యాణోత్సవాన్ని సోమవారం బీరప్ప, కామరతి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజల్లో మంత్రి దామోదర రాజనర్సింహా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తక్కడపల్లి, పొల్కంపల్లి గ్రామాల్లో జరిగిన బీరప్ప, మల్లన్న దేవతామూర్తులను మంత్రి దామోదర రాజనర్సింహా సోమవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశంగౌడ్, ఎంపీటీసీ బాబుపాటిల్, శివచంద్రకుమార్, నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి'

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి జరిగి లక్షల మందికి ఉపాధి లభించిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు. మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా మే 1న నిర్వహించే సమావేశ కరతపత్రాన్ని సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామచంద్రాపురం శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు జనార్దన్‌రెడ్డి, రవీంద, గణేష్, మల్లికార్జున్, చంద్రమౌళి పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ గెలుపును ఆపలేరు



జిన్నారం: ప్రచారంలో పాల్గొన్న నీలం మధు, కాటా శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి గుమ్మడిదల, జిన్నారం గ్రామాల్లో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డితో కలిసి సోమవారం నీలం మధు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పల్నాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

సంగారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వంతో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు అన్నారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డితో కలిసి సంగారెడ్డిలోని తారా వాకర్స్ క్లబ్, కలెక్టరేట్ సమీపంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయం ఖాయం

హత్నూర(సంగారెడ్డి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని జెడ్పీటీసీ ఆంజనేయులు, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీం ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని సిరిపురం, తెల్లరాళ్ల తండా, గోవిందరాజ్ పల్లి, చీక్‌మద్దూర్, కొన్యాల, పన్యాల, బడంపేట్ మధుర, నవాబుపేట, హత్నూర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.



హత్నూర: సిరిపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



సదాశివపేట: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ, పీఏఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులువెంకటేశం, శ్రీనివాస్‌రెడ్డి, మణిదీప్, కిష్టయ్య, శివరాజ్, నాయకులు పాల్గొన్నారు.

సదాశివపేటలో ఇంటింటా ప్రచారం

సదాశివపేట(సంగారెడ్డి): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరుతూ సదాశివపేట పట్టణంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

జోగిపేట(అందోల్): అనుమానాస్పదంగా వివాహిత మృతి చెందిన ఘటన అందోలులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ కథనం మేరకు.. కౌడిపల్లి మండలం బుజరంపేట గ్రామానికి చెందిన మంగమ్మ(30)ను అందోలు గ్రామానికి చెందిన అశోక్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండు రోజుల కిందట మంగమ్మ అమ్మగారింటికి వెళ్లింది. ఆదివారం భార్యకు అశోక్ ఫోన్ చేసి త్వరగా ఇంటికి రావాలని కోరగా రాత్రి 9 గంటల వరకు ఇంటికి వచ్చింది. రాత్రి ఇద్దరూ నిద్రించగా, మరుసటి రోజు సోమవారం మధ్యాహ్నం వరకు మంగమ్మ లేవలేదు. వెంటనే అత్తగారింటికి సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలిపై గాయాలు ఉన్నాయని, ఉద్దేశ్య పూర్వకంగానే హత్య చేసినట్లు గ్రామస్తులంతా వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్, సీఐ అనీల్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి మృతురాలి ఒంటిపై గాయాలు ఉన్నాయా? అని పరిశీలించారు. ఒంటిపై అక్కడక్కడా దద్దులు ఉన్నట్లు గుర్తించారు. మృతురాలి తండ్రి భట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగదు పట్టివేత



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సెల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకెళ్తున్న రూ.54,500 నగదును పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తే చర్యలు తప్పవన్నారు. తనిఖీలో పట్టుబడిన నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

'తప్పుడు ప్రచారం మానుకోవాలి'

నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీగా సురేష్‌షెట్కార్ హయాంలో మంజూరైన పనులను తమ హయాంలోనే మంజూరు చేసినట్లు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటూ తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని టీపీసీసీ వార్‌రూం సోషల్‌మీడియా ఇన్‌చార్జి గిరిజా షెట్కార్ హితవు పలికారు. నారాయణఖేడ్‌లో సురేష్ షెట్కార్ నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2009 నుంచి 2014 వరకు సురేష్‌షెట్కార్ జహీరాబాద్ ఎంపీగా ఉండగా ఆ సమయంలోనే ఆయన కృషితోనే రాష్ట్ర హైవేగా ఉన్న సంగారెడ్డి–నాందేడ్–అకోలా రోడ్డును నేషనల్ వే అథారిటీ అధికారులతో సర్వే చేయించి జాతీయ రహదారిగా మార్చి 161 నెంబరును కేటాయించి నాలుగు లేన్లుగా విస్తరించడానికి నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. అందుకు సంబంధించిన గెజిట్‌ను ప్రదర్శించారు. గెజిట్ ప్రతులను బీఆర్ఎస్, బీజేపీ ముఖ్యనాయకులకూ పంపుతామన్నారు. ఖేడ్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్, ఖేడ్, ఎల్లారెడ్డిల్లో ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలు మంజూరు చేయించింది షెట్కారేనని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆయా వాటిని తామే మంజూరు చేయించామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. గెజిట్ అంటే ధరణిలో రాత్రికి రాత్రి మార్చి భూకబ్జాలు చేసినట్లు కాదన్నారు. ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని, ఎన్నికలయ్యాక ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ఆయన భూకబ్జాల వివరాలు సేకరించి ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని గిరిజషెట్కార్ తెలిపారు.



గెజిట్ చూపుతున్న గిరిజాషెట్కార్

మురుగు కాలువలో చెత్తాచెదారం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్ కాలనీ వద్ద వర్షపునీరు వెళ్లే కాలువలో డ్రైనేజీ నీరు చేరడంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ నెల 25వ తేదీన సాక్షి దినపత్రికలో 'వర్షపు నీటి కాలువలో మురుగు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మురుగు కాలువ వద్ద పగిలిపోయిన డ్రైనేజీ పైపులైన్లను తొలగించి నూతన పైపు లైన్లను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీలో సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపినట్లు అధికారులు పేర్కొన్నారు.



మురుగు కాలువలోని చెత్తాచెదారాన్ని తొలగించిన పారిశుధ్య సిబ్బంది

వైభవంగా బోనాలు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో 4 రోజులుగా జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారికి బోనాలను సమర్పించారు. బోనాల సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది.



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

సంక్షిప్త వార్తలు

◆ **గుర్తు తెలియని మృతదేహం లభ్యం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సోమవారం మండల పరిధిలోని మద్దికుంట గ్రామ శివారులో చోటు చేసుకుంది. సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయస్సు గల మగ వ్యక్తి మృతదేహం మద్దికుంట శివారులోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమ పక్కన పడి ఉంది. వడదెబ్బ, అనారోగ్యం కారణంగా మృతి చెంది ఉండొచ్చు అని తెలుస్తుంది. సిద్దాపూర్ గ్రామ నివాసి గండె శివకోటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

◆ **ఘనంగా పూర్వాషాఢ నక్షత్ర వేడుకలు**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని భవానీ భువనేశ్వరి దేవాలయంలో పూర్వాషాఢ నక్షత్ర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

◆ **కొనసాగుతున్న జొన్నల కొనుగోలు**

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టిలోని వ్యవసాయ మార్కెటింగ్ గిడ్డంగిలో జొన్నల కొనుగోలు జోరుగా సాగుతుంది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రానికి తడ్కల్, చాప్టా, తుర్కవడ్‌గాం, దెగుల్‌వాడి, కంగ్టి, బోర్గి, జమ్గి, రాసోల్, బాన్సువాడ, దామర్‌గిద్దా తదితర గ్రామాలకు చెందిన రైతులు జొన్నలు తరలిస్తున్నట్లు ప్యాక్స్ సిబ్బంది అడివప్ప తెలిపారు. క్వింటాలుకు రూ.3,180 చెల్లించి కొనుగోలు చేస్తున్నందుకు రైతులు టోకెన్‌తో పాటు పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు జిరాక్స్‌లు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిక**



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చీకూర్తి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు తన్వీర్, బాస్కర్‌రెడ్డి, చంద్రప్ప, సిద్ధిలింగయ్యస్వామి, రఫీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **గెలిపిస్తే ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తా**

నారాయణఖేడ్: తనను గెలిపిస్తే గెలిచిన మొదటి నెలలోనే నారాయణఖేడ్‌లో జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ పేర్కొన్నారు. నాగల్‌గిద్ద, మనూరు మండల కేంద్రంలో రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు నాగేందర్‌రావు, విఠల్‌రావు, పండరి, నాగప్ప, రాజేందర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు శివశంకర్, వెంకట్‌రావు, సంజీవ్‌యాదవ్, సంతోష్‌పాటిల్, నందు పాటిల్, ప్రహ్లాద్, లక్ష్మణ్‌నాయక్, అశోక్ పటేల్, జగ్గప్ప, గణపతి పాల్గొన్నారు.

◆ **బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం**



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గుంజోటి, వడ్డి తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ తరఫున ఆయన కోడలు వచనపాటిల్ ప్రచారం నిర్వహించారు. నాయకులు రాహుల్ పాలింకార్, మల్లేష్, పాండురంగారావు పాటిల్, బస్వరాజ్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, రవిందర్, మారుతప్ప, నర్సప్ప, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి**



నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా నాయకులు ప్రకాష్‌రాథోడ్ అన్నారు. మండలంలోని అకలై తండాలో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు సురేష్ నాయక్, శంర్, సర్దార్ నాయక్ తదితరులు ఉన్నారు.

◆ **బీజేపీ అభ్యర్థిని గెలిపించండి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని అంకేనపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు ఆదిత్య, సారకృష్ణ, అంబదాస్, మోహన్‌డ్డి, సత్యనారాయణగౌడ్, కృష్ణగౌడ్, శ్రీకాంత్, ప్రశాంత్, భరత్ పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్‌కు రాజీనామా**

మునిపల్లి(అందోల్): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దలోడి వడ్ల విజయ్‌కుమార్ పార్టీ పదవికి రాజీనామా చేశాడు. అనివార్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన రాజీనామా పత్రాన్ని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు పంపినట్లు తెలిపారు.

◆ **సన్మానం**



రామచంద్రాపురం (పటాన్ చెరు): పటాన్ చెరు సర్కిల్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన భారతినగర్ డివిజన్‌కు చెందిన ఎండీ గౌస్‌ను రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ తనకు పదవికి సహకరించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధురెడ్డి, కుమార్‌యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.